శ్రీరస్తు శుభమస్తు


శ్రీ వశిష్ఠ మహర్షి విరచిత

దారిద్ర్య దహన శివ స్తోత్రమ్

- భావార్థముతో -



అవిఘ్నమస్తు



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్, 3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/



దారిద్ర్య దహన శివ స్తోత్రమ్ - భావార్థముతో -

01. విశ్వేశ్వరాయ నరకార్ణవ తారణాయ
కర్ణామృతాయ శశిశేఖర ధారణాయ।
కర్పూరకాంతి ధవళాయ జటాధరాయ
దారిద్ర్య దుఃఖ దహనాయ నమః శివాయ॥

సమస్త లోకాలకూ అధిపతి, నరకమనే మహాసాగరాన్ని తరింపజేసేవాడు, కర్ణామృతాది పేర్లు గలవాడు, చంద్రుని ఆభరణంగా ధరించినవాడు, కర్పూర కాంతివలె ప్రకాశించువాడు, జటాజూటాన్ని కలిగి ఉన్నటువంటి వాడు, దారిద్ర్య దుఃఖాన్ని దహించే వాడూ అయిన ఆ పరమేశ్వరునికి ప్రణామం.

దారిద్ర్యమును నాశనం చేసి, జగన్నాథుడై నరకమునుండి తప్పించే, చంద్ర రేఖను ఆభరణముగా ధరించి, కర్పూర కాంతివంటి ధవళ స్వరూపము కలిగినవాడు, జటను కలిగినవాడు అయిన ఈశ్వరుని నా దారిద్ర్యమును తొలగించ వలసినదిగా ప్రార్థిస్తున్నాను.

02. గౌరీప్రియాయ రజనీశ కళాధరాయ
కాలాంతకాయ భుజగాధిప కంకణాయ।
గంగాధరాయ గజరాజ విమర్ధనాయ
దారిద్ర్య దుఃఖ దహనాయ నమః శివాయ॥

గౌరీప్రియుడు, శిరస్సున చంద్రకళను ధరించినవాడు, మృత్యుదేవునికి మృత్యు వైనవాడు, సర్పరాజును చేతి కంకణముగా అలంకరించు కున్నవాడు, గంగాభవానిని తలపై నిడుకొన్నవాడు, మదగజాధిపుని మదమణచినవాడు, దారిద్ర్య దుఃఖాన్ని దహించే వాడూ అయిన ఆ పరమేశ్వరునికి ప్రణామం.

గౌరీ ప్రియమనోహరుడై, చంద్రశేఖరుడై, కాలుని సంహరించినవాడై, నాగా భరణుడై, గంగాధరుడై, గజరాజుని సంహరించినవాడైన ఈశ్వరుని నా దారిద్ర్యమును తొలగించ వలసినదిగా ప్రార్థిస్తున్నాను.

03. భక్తప్రియాయ భవరోగ భయాపహాయ
ఉగ్రాయ దుఃఖ(దుర్గ) భవసాగర తారణాయ
జ్యోతిర్మయాయ గుణనామ (సముస్థితాయ)సునృత్యకాయ
దారిద్ర్య దుఃఖ దహనాయ నమః శివాయ॥

సద్భక్తులకు అత్యంత సన్నిహితుడు, జనన మరణ భయాలనుండి విడిపించేవాడు, ఉగ్రరూపుడై దుష్టులను శిక్షించేవాడు, భవసాగరాన్ని సునాయాసంగా దాటించగల సమర్థుడు, జ్యోతి స్వరూపుడు, తన సద్గుణ నామాలను స్మరించగానే పరవశించి ఆనందంతో నృత్యం చేసేవాడు, దారిద్ర్య దుఃఖాన్ని దహించే వాడూ అయిన ఆ పరమేశ్వరునికి ప్రణామం.

భక్తసులభుడై, సమస్త వ్యాధులను నివారించువాడై, రుద్రుడై, భవసాగరమును తరింపజేయువాడై, జ్యోతిస్వరూపుడై, శుభనామములతో కీర్తింపబడువాడైన ఈశ్వరుని నా దారిద్ర్యమును తొలగించ వలసినదిగా ప్రార్థిస్తున్నాను.

04. చర్మాంబరాయ శవభస్మ విలేపనాయ
ఫాలేక్షణాయ మణికుండల మండితాయ
మంజీరపాద యుగళాయ జటాధరాయ
దారిద్ర్య దుఃఖ దహనాయ నమః శివాయ॥

ఏనుగు చర్మాన్ని వస్త్రంగా ధరించినవాడు, శ్మశానంలోని బూడిదను దేహమంతా పూసుకున్నవాడు, నుదుట మూడో కన్ను గల త్రినేత్రుడు, ఫణి కుండలా లంకృతుడు,

అందెల శోభతో మరింత నయనానందాన్ని కలిగించే పాదపద్మాలు కలవాడు, జటాజూట ధరుడు, దారిద్ర్య దుఃఖాన్ని దహించే వాడూ అయిన ఆ పరమేశ్వరునికి ప్రణామం.

గజచర్మధారియై, శవ భస్మమును శరీరమంతా లేపనం చేసుకున్నవాడై, త్రినేత్రుడై, మణికుణ్డలధారియే, పాదములకు గజ్జెలను ధరించి, జటాధరుడైన ఈశ్వరుని నా దారిద్ర్యమును తొలగించ వలసినదిగా ప్రార్థిస్తున్నాను.

05. పంచాననాయ ఫణిరాజ విభూషణాయ
హేమాంశుకాయ భువనత్రయ మండితాయ।
ఆనందభూమి వరదాయ తమోమయాయ
దారిద్ర్య దుఃఖ దహనాయ నమః శివాయ॥

పంచముఖాలతో ప్రకాశించువాడు, సర్పరాజును ఆభరణంగా అలంకరించు కున్నవాడు, స్వర్ణమయమాన దుస్తులను ధరించినవాడు, ముల్లోకాలకూ శోభను చేకూర్చేవాడు, ఆనందానికి మూలస్థానమైనవాడు, భక్తులు అడిగినదే తడవుగా అన్నింటినీ ప్రసాదించేవాడు, తమోగుణాన్ని ఆదిలోనే అంతమొందించేవాడు, దారిద్ర్య దుఃఖాన్ని దహించే వాడూ అయిన ఆ పరమేశ్వరునికి ప్రణామం.

పంచ ముఖుడై, వాసుకిని కంఠాభరణముగా ధరించినవాడై, స్వర్ణాంబరమును ధరించి, ముజ్జగములకు ఆభరణము వంటివాడై, వరప్రదాయకుడై, ఆనంద స్వరూపుడై, తమో స్వరూపుడైన ఈశ్వరుని నా దారిద్ర్యమును తొలగించ వలసినదిగా ప్రార్థిస్తున్నాను.

06. భానుప్రియాయ భవసాగర తారణాయ
కాలాంతకాయ కమలాసన పూజితాయ।
నేత్రత్రయాయ శుభలక్షణ లక్షితాయ
దారిద్ర్య దుఃఖ దహనాయ నమః శివాయ॥

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

సూర్యదేవుని పట్ల ప్రేమ గలవాడు, భవసాగరాన్ని తరింపజేయడంలో ఆధారభూతుడై ఉండేవాడు, అంతకుడైన యమధర్మరాజుకే మహాయముడై నట్టివాడు, బ్రహ్మదేవునిచే పూజించబడ్డవాడు, మూడు కన్నులతో ముక్కంటి అన్న సార్థక నామాన్ని పొందినవాడు, సకల శ్రేయస్సులకూ మూలమైన శుభలక్షణాలను కలిగి ఉన్నవాడు, దారిద్ర్య దుఃఖాన్ని దహించే వాడూ అయిన ఆ పరమేశ్వరునికి ప్రణామం.

సూర్య భగవానునికి ఇష్టుడై, జనన మరణ చక్రంనుండి విముక్తి కలిగించేవాడై, యముని సంహరించినవాడై, బ్రహ్మచే ఆరాధింపబడువాడై, శుభలక్షణ సంపన్నుడైన ఈశ్వరుని నా దారిద్ర్యమును తొలగించ వలసినదిగా ప్రార్థిస్తున్నాను.

07. రామప్రియాయ రఘునాథ వరప్రదాయ
నాగప్రియాయ నరకార్ణవ తారణాయ।
పుణ్యాయ(పుణ్యేషు) పుణ్యభరితాయ సురార్చితాయ
దారిద్ర్య దుఃఖ దహనాయ నమః శివాయ॥

శ్రీరామునితో సఖ్యత గలవాడు, రఘునాథునికి వరాలను ప్రసాదించినవాడు, నాగేంద్రుని పట్ల అత్యంత ప్రియం కలవాడు, హిమాలయాన్ని గృహముగా పొందినవాడు, పుణ్యపురుషుడు, పావనచరితుడు, దేవగణాలచే సేవింపబడేవాడు, దారిద్ర్య దుఃఖాన్ని దహించే వాడూ అయిన ఆ పరమేశ్వరునికి ప్రణామం.

రామచంద్రునికి ఇష్టుడై, రామునకు వరప్రదాతయై, నాగులకు ప్రియుడై, నరకమును తొలగించువాడై, పవిత్రులలో పవిత్రుడై, సమస్త దేవతలచే ఆరాధింపబడే ఈశ్వరుని నా దారిద్ర్యమును తొలగించ వలసినదిగా ప్రార్థిస్తున్నాను.

08. ముక్తేశ్వరాయ ఫలదాయ గణేశ్వరాయ
గీతప్రియాయ వృషభేశ్వర వాహనాయ।

మాతంగచర్మ వసనాయ మహేశ్వరాయ
దారిద్ర్య దుఃఖ దహనాయ నమః శివాయ॥

ముక్తిప్రదాత అయిన ఈశ్వరుడు, కర్మానుసార ఫలాలను ప్రసాదించేవాడు, శివ గణాలకు అధిపతి అయినవాడు, సామగాన ప్రియుడు, నందీశ్వరుణ్ణి ప్రత్యేక వాహనంగా పొందినవాడు, ఏనుగు చర్మాన్ని వస్త్రంగా ధరించినవాడు, మహేశ్వర నామంతో స్మరింపబడేవాడు, దారిద్ర్య దుఃఖాన్ని దహించే వాడూ అయిన ఆ పరమేశ్వరునికి ప్రణామం.


ముక్తిప్రదాతయై, ఫలితాలను ప్రసాదించే గణేశ్వరుడై, గానప్రియుడై, వృషభవాహనుడై, మాతంగ చర్మధారియైన ఈశ్వరుని నా దారిద్ర్యమును తొలగించ వలసినదిగా ప్రార్థిస్తున్నాను.

09. వశిష్ఠేన కృతం స్తోత్రం సర్వరోగ నివారణం
సర్వసంపత్కరం శీఘ్రం పుత్రపౌత్రాది వర్ధనమ్।
త్రిసంధ్యం యః పఠేన్నిత్యం
స హి స్వర్గ మవాప్నుయాత్॥

వశిష్టునిచే రచించబడ్డ ఈ స్తోత్రాన్ని ప్రతిరోజూ త్రిసంధ్యా కాలాల్లో పఠించేవారు సర్వరోగ నివారణను, అష్టైశ్వర్య సిద్ధిని, పుత్రపౌత్రాదిక వంశవృక్ష సంవృద్ధిని పొంది పుణ్యలోకాలను చేరుకుంటారు.

వసిష్టునిచే ప్రకటించబడిన ఈ స్తోత్రం సర్వరోగ నివారణం, సర్వ ఐశ్వర్య ప్రదాయకం, పుత్ర పౌత్రాది వృద్ధికరం. ఈ స్తోత్రాన్ని నిరంతరం త్రిసంధ్యలలో ఎవరు పఠిస్తారో, వారికి స్వర్గప్రాప్తి లభిస్తుంది.

– – ఇతి “ శ్రీ వశిష్ట మహర్షి విరచిత ”
“ దారిద్ర్య దహన శివ స్తోత్రం ” సంపూర్ణమ్ – –




(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)